# బడే భాయ్‌తో ఫెవికాల్ బంధమేనా?

- కొత్త గవర్నర్ జిష్ణుదేవ్ ఎంపికతో బంధం బలోపేతం!
- మోదీ తరువాత రేవంత్ నుంచే శుభాకాంక్షలు

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ పెద్దలతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి సత్సంబంధాలు ఉన్నాయా?, పూర్వాశ్రమంలో సంఘ్‌పరివార్‌తో ఆయనకున్న అనుబంధం కారణంగా బీజేపీ పెద్దలు రేవంత్‌ను తమ వాడిగా భావిస్తున్నారా? అంటే, తాజాగా జరిగిన ఓ ఉదంతం ఇందుకు బలం చేకూర్చేలా ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాలలో వ్యక్తమవుతున్నది. తెలంగాణకు గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నియమితులైన సందర్భంగా జరిగిన పరిణామం కేంద్ర ప్రభుత్వ పెద్దలతో రేవంత్‌రెడ్డికి ఉన్న సంబంధాలను పరోక్షంగా బయటపెట్టాయని ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రధాని మోదీ శనివారం రాత్రి తనకు ఫోన్ చేసి త్రిపుర వెలుపల పని చేయాల్సి ఉంటుందని మాత్రమే చెప్పారని, ఆ తర్వాత కాసేపటికే సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ చేసి తెలంగాణకు స్వాగతం అని అన్నారని, దీంతో తనను గవర్నర్‌గా నియామించినట్టు తెలిసిందని జిష్ణుదేవ్ వర్మ సోమవారం మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. తెలంగాణకు కొత్త గవర్నర్ నియామకం విషయం మీడియాకు కూడా సోమవారమే తెలిసింది. కానీ ఈ విషయం శనివారం రాత్రే సీఎం రేవంత్‌రెడ్డికి ఎలా తెలిసింది? అన్నది ప్రస్తుతం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరుస్తున్నది.



గవర్నర్ నియామకం అంశం కేంద్ర హోం శాఖ పరిధిలో ఉంటుంది. ఈ శాఖకు బీజేపీ అగ్ర నాయకుడు అమిత్ షా మంత్రిగా ఉన్నారు. అందువల్ల ఈ విషయం తొలుత ప్రధానికి, ఆ తరువాత హోంశాఖ మంత్రికే తెలుస్తుంది. పోనీ బీజేపీ సీఎం అయినా ఈ సమాచారం తెలిసే అవకాశం ఉంటుంది. కానీ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి చెందిన సీఎం రేవంత్‌రెడ్డికి ఈ సమాచారం ఎలా తెలిసిందన్నదే ఈ వర్గాలను వేధిస్తున్న ప్రశ్న. సీఎం రేవంత్‌రెడ్డికి పీఎంవో లేదా కేంద్ర హోంశాఖ వర్గాల నుంచే సమాచారం అంది ఉండాలనే అనుమానం వ్యక్తమవుతున్నది.

**రేవంత్‌పై మొదటి నుంచి అనుమానాలే ?**

రేవంత్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వంలో బీజేపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు మొదటి నుంచి ఉన్నాయి. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డిని నియమించిన సందర్భంగా అదే పార్టీకి చెందిన పంజాబ్ మాజీ సీఎం అమరేందర్ సింగ్ చేసిన వ్యాఖ్యలను పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. సంఘ్‌పరివార్‌తో సంబంధాలున్న వ్యక్తిని పీసీసీ అధ్యక్షునిగా ఎలా నియమిస్తారని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని అమరేందర్‌సింగ్ తప్పుపట్టిన విషయం తెలిసిందే. గతంలో ఎంపీగా ఉన్న సందర్భంగా పార్లమెంట్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పుట్టుపూర్వోత్తరాలపై రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం సంఘ్ పరివార్‌తో ఆయనకు ఉన్న సంబంధాలను బహిర్గతం చేశాయని ఈ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీఎంలు ఎవరూ కూడా ప్రధాని మోదీని బడేభాయ్‌గా సంబోధించిన దాఖలాలు లేవని కూడా చెప్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ పెద్దలతో రేవంత్‌రెడ్డికి ఉన్న సంబంధాల వల్లనే కొత్త గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నియామకంపై మొదటి సమాచారం ఉండి ఉంటుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## నేడు రాష్ట్ర గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ బాధ్యతలు



హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గవర్నర్‌గా నియమితులైన జిష్ణుదేవ్ వర్మ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు ఆయన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణం చేయించనున్నారు. ఈ మేరకు రాజ్‌భవన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జిష్ణుదేవ్ త్రిపురలోని తన నివాసమైన కుంజబన్ ప్యాలెస్ నుంచి బయలుదేరి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 2 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రాజ్‌భవన్‌కు చేరుకొని సాయంత్రం 5.03 గంటలకు గవర్నర్‌గా బాధ్యతలు చేపడతారు. రాజ కుటుంబానికి చెందిన జిష్ణుదేవ్ 1957 ఆగస్టు 15న జన్మించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. 1990 ప్రారంభంలో బీజేపీలో చేరారు. జిష్ణుదేవ్ 2018 నుంచి 2023 వరకు త్రిపుర రాష్ట్ర డిప్యూటీ సీఎంగా పనిచేశారు. త్రిపుర నుంచి ఓ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమితులైన తొలి వ్యక్తిని తానేనని జిష్ణుదేవ్ వర్మ సోమవారం అగర్తలాలో మీడియాకు వెల్లడించారు.

---

- **మా సమస్యలు పరిష్కరించండి**



తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో మంగళవారం పెద్ద ఎత్తున ధర్నా చేశారు. భారీ సంఖ్యలో వీఆర్‌ఏలు తరలివచ్చి ధర్నాలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ హోరెత్తించారు.

- **పెన్షనర్ల మౌన దీక్ష**



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద పెన్షనర్లు మౌన దీక్ష చేశారు. వందలాది మంది పెన్షనర్లు తరలివచ్చి నిరసన తెలపడంతో ధర్నా చౌక్ దద్దరిల్లిపోయింది. తమ డిమాండ్లు నెరవేర్చేదాకా పోరాటం కొనసాగిస్తామని పెన్షనర్లు స్పష్టంచేశారు.

- **ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలివ్వండి**




కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా కేంద్రంలోని అమలవీరుల స్తూపం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ఉద్యమకారులు భారీ ర్యాలీ తీశారు. వంద రోజుల్లో నెరవేరుస్తామని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని మండిపడ్డారు.

- **మా స్కూల్‌కు టీచర్లను నియమించండి**



విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పాఠశాలలో 189 మంది విద్యార్థులకు ముగ్గురే ఉపాధ్యాయులున్నారని, వారిలో ఒకరు సెలవుపై వెళ్లారని చెప్పారు.

- **ఆకలిగా ఉంది.. అన్నం పెట్టండి!**



'ఆకలవుతున్నది.. అన్నం పెట్టండి' అంటూ సర్కారు బడి విద్యార్థులు మంగళవారం ధర్నాకు దిగారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగోటం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన బిల్లులు రాక వంట చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో నెలన్నర నుంచి తాము ఆకలితో అలమటిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతూ విద్యార్థులు పాఠశాల ఎదుట ధర్నా చేశారు. బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి దాసు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

---



కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించిన ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

# జీతాలు పెంచుతరా.. లేదా?

- ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగుల భారీ ధర్నా
- వేలాదిగా తరలివచ్చిన ఉద్యోగులు, కార్మికులు
- స్తంభించిన కోఠి.. ప్రధాన చౌరస్తాలన్నీ బంద్
- పలు జిల్లాల్లో ముందస్తు అరెస్టులు



ధర్నాలో పాల్గొన్న ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్



కోటగిరి మండల పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షురాలు రాజేశ్వరికి అర్ధరాత్రి నోటీసులు అందజేస్తున్న పోలీసులు

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ)/హైదరాబాద్ సిటీబ్యూరో : వేతనాలు పెంచాలంటూ నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)పథకం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం భారీ ధర్నా చేపట్టారు. వేలాది మంది కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం కోఠి ప్రధాన రహదారులను దిగ్బంధించారు. పెద్దసంఖ్యలో ఒకేసారి రోడ్లపైకి రావడంతో వారిని నిలువరించలేక పోలీసులు చేతులెత్తేశారు. ఫలితంగా కోఠి పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులన్నీ ట్రాఫిక్‌తో స్తంభించాయి. దీంతో పోలీసులు కోఠికి వెళ్లే అన్ని ప్రధాన మార్గాలను మూసివేశారు. వాహనాలను దారి మళ్లించారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగులకు క్యాడర్ ఫిక్సేషన్ చేసి బేసిక్ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం కింద రాష్ట్రంలో సుమారు 17వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారని, 78 రకాల క్యాడర్లలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలకు వైద్యసేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నా.. వారికి కనీస వేతనాలు అమలుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. పైగా వేతనాలను రెండు మూడు నెలలు ఆలస్యంగా ఇస్తుండటంతో వేలాది కుటుంబాలు వీధిన పడే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా.. కనీసం వారి బేసిక్ పేతో సమానమైన జీతం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఈ విషయంపై అనేక సందర్భాల్లో ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశామని, అయినా వారి నుంచి స్పందన లేదన్నారు. అందుకే మహాధర్నా చేపట్టినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమా రాజేశ్ కన్నా మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన ఏడు నెలల పీఆర్సీ నేటికీ విడుదల చేయకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ముట్టడిని పోలీసులు అడ్డుకోగా వారు రోడ్డుపై బైఠాయించారు. పలువురు ఉద్యోగులు రోడ్డుపై పడుకొని నిరసన తెలిపారు. పొర్లుదండాలు పెట్టారు. ఆ తర్వాత కమిషనరేట్ ముట్టడికి బయల్దేరగా పోలీసులు గేట్లు మూసివేసేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో ఉద్యోగులు, పోలీసుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కొందరికి గాయాలయ్యాయి. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఉప ప్రధాన కార్యదర్శి బాపుయాదవ్, నర్సింగ్ ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నిశాంతిని, జ్యోతి, గోపి పాల్గొన్నారు.

**ముందస్తు అరెస్టులు..**

న్యూస్‌నెట్‌వర్క్: ఉమ్మడి నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులను ఎక్కడికక్కడ నిర్బంధించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం 'చలో హైదరాబాద్' కార్యక్రమం చేపట్టగా వారిని హైదరాబాద్ వెళ్లకుండా అరెస్టు చేశారు. ఆశ కార్యకర్తలను అరెస్ట్ చేసి మహబూబ్‌నగర్ టౌటూన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆశ కార్యకర్తలు బాన్సువాడ ఠాణా ఎదుట నిరసన తెలిపారు.

## నిబంధనలకు విరుద్ధంగా మినహాయింపులు

**టీజీజీడీఏ ఆఫీస్ బేరర్లపై ఆరోపణలు**

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ) : కొందరు డాక్టర్లు బదిలీల నిబంధనలకు విరుద్ధంగా మినహాయింపులు పొందారంటూ ఎస్సీ, ఎస్టీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ బాబూరావు ఆరోపించారు. మంగళవారం ఆయన వైద్యారోగ్య శాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ లాలుప్రసాద్ తదితరులు తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్(టీజీజీడీఏ)ఆఫీస్ బేరర్లుగా చెప్పుకొని బదిలీల నుంచి మినహాయింపు పొందారని పేర్కొన్నారు. పల్లం ప్రవీణ్ 19ఏండ్లుగా, బొంగు రమేశ్ 17ఏండ్లుగా, లాలుప్రసాద్ 12ఏండ్లుగా హైదరాబాద్‌లోనే పనిచేస్తున్నారని చెప్పారు. వారు 2016–18 మధ్య ఆఫీస్ బేరర్లుగా పనిచేశారని తెలిపారు. బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన జీవో 80 ప్రకారం ఆఫీస్ బేరర్లకు గరిష్ఠంగా ఆరేండ్ల మినహాయింపు మాత్రమే ఉంటుందని గుర్తుచేశారు. కానీ, వారు అంతకుమించి ఒకే కేంద్రంలో పనిచేస్తున్నందున మినహాయింపులకు అర్హులు కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

## 40 కోట్లకు బ్యాంకు సిబ్బంది బురిడీ

జూబ్లీహిల్స్, జూలై 30: కంచే చేను మేసిన చందంగా మారింది ఆ బ్యాంక్ ఉద్యోగుల తీరు. శంషాబాద్ పరిధిలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ కే రామస్వామి, సర్వీస్ డెలివరీ మేనేజర్ ఎస్ రాజేశ్ ఏకంగా రూ.40 కోట్ల సొమ్మును దారి మళ్లించేందుకు సహకరించారు. సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసుల కథనం ప్రకారం.. జూలై 12న సదరు బ్యాంక్ ఉద్యోగులు ఒక వినియోగదారుడితో అనధికార లావాదేవీలు నిర్వహించి ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఖాతా నుంచి పలు ఖాతాలకు పెద్ద మొత్తాలను బదిలీ చేశారు. రామస్వామి, రాజేశ్‌ను ఇప్పటికే అరెస్ట్ చేసిన పోలీసులు కేసులో కీలక పాత్రధారిగా ఉన్న షేక్ బషీద్‌ను సోమవారం ఢిల్లీలో అరెస్ట్ చేశారు.

---

# కాంగ్రెస్‌తోనే చేనేత సంక్షోభం

**తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్**

రాజన్న సిరిసిల్ల, జూలై 30 (నమస్తే తెలంగాణ)/గంగాధర: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మండిపడ్డారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడం వల్ల ఉపాధి కోల్పోయి 10 మంది కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని తెలిపారు. వస్త్ర పరిశ్రమలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల (జేఏసీ) ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆసాములు, యజమానులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. రమేశ్ మాట్లాడుతూ.. బతుకమ్మ చీరల ఆర్డర్లు, విద్యుత్తు, నూలు రాయితీలు బంద్ కావడంతో 30 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. సీపీఐ నాయకులు పంతం రవి మాట్లాడుతూ బతుకమ్మ పేరుతో చీరల ఆర్డర్లు ఇవ్వాలని లేకుంటే.. ఇందిరమ్మ, సోనియమ్మ, జనతా వస్త్రాల పేరుతోనైనా ఆర్డర్లు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. ధర్నాలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పాలిస్టర్ యజమానుల సంఘం నాయకులు బొద్దుల సుదర్శన్, సామల శ్రీనివాస్, మండల సత్యం, ఆడెపు భాస్కర్, గంగుల శ్రీనివాస్, కోడం రమణ పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి పవర్‌లూమ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కురిక్యాల వద్ద కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారిపై చేనేత కార్మికులు రాస్తారోకో చేశారు. వారికి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మద్దతు ప్రకటించారు. రాస్తారోకోలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సంఘం నాయకులు అలువాల విఠోభ, అలువాల తిరుపతి, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల వద్ద కరీంనగర్–జగిత్యాల రహదారిపై రాస్తారోకో చేస్తున్న నేతన్నలు



మంగళవారం అసెంబ్లీ ముట్టడించిన తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగులు

# సీఎం.. చాయ్ తాగేంత టైం దొరకలేదా?

- 8 నెలలైనా మా హామీ నెరవేర్చరా?
- సీఎం అలసత్వంపై సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆగ్రహం
- అసెంబ్లీ ముట్టడికి యత్నం, పోలీసుల అరెస్టులు
- సొమ్మసిల్లి పడిపోయిన మహిళా ఉద్యోగులు



అసెంబ్లీని ముట్టడించిన సమగ్ర శిక్షణ ఉద్యోగులను అరెస్టు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): సీఎం గారూ మాకిచ్చిన హామీని మరిచారా? 'నేను ముఖ్యమంత్రినైతే చాయ్ తాగినంత సమయంలో మీ సమస్యలు తీరుస్తా' అని ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో మాటిచ్చారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడిచినా కనీసం చాయ్ తాగేంత టైమ్ కూడా మీకు లేదా? అని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వారు అసెంబ్లీని ముట్టడించారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకొని అరెస్టులు చేశారు. పలువురు ఉద్యోగులను ఈడ్చిపడేడంతో కొందరు మహిళా ఉద్యోగులు సొమ్మసిల్లి పడిపోయా రు. తమను రెగ్యులర్ చేసి, బేసిక్ పే (మినిమమ్ టైమ్ స్కేల్) ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌కు తమను పిలిచిమరీ డిమాండ్లను నెరవేర్చుతామని రేవంత్‌రెడ్డి నాడు హామీ ఇచ్చారని, అది నెరవేర్చకపోవడంతోనే ఆందోళనకు దిగామని తెలిపారు.

**సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లు**

రాష్ట్రవ్యాప్తంగా 19,600 మందికి పైగా సమగ్ర శిక్ష విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారిని వెంటనే రెగ్యులర్ చేసి కనీస వేతన స్కేలు ఇవ్వాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా 5 లక్షల సౌకర్యం కల్పించాలని, పీటీఐలకు మిగతా ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల్లాగా 12 నెలల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కింద రూ.20 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, సుమన్, సహదేవ్, సురేందర్, మల్లేశ్, యాదగిరి, షేక్ మహబూబ్ పాషా, రమేశ్, చందూ, రవీందర్, జానకీరాం, మహేందర్, సంధ్యారాణి, దుర్గం శ్రీను, రాజేందర్, అనితాచారి, మంజుల సావిత్రి పాల్గొన్నారు.